# మరింత బలహీనం




**సమీక్ష** : అమెరికా మరో మారు మాంద్యం కోరల్లో చిక్కుకోగలదన్న భయం, యూరప్ దేశాల్లో రుణ సంక్షోభం.. ఈ అంశాలు భారత్ సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను గత వారం కుంగదీశాయి. అంతర్జాతీయ మార్కెట్లు లాభపడడంతో గత వారం దేశీయ మార్కెట్ లాభంతోనే ఆరంభమైంది. అయితే.. నిరుత్సాహపరిచిన అంతర్జాతీయ వార్తలు, వర్షాలు సాధారణ స్థాయిలో ఉండకపోవచ్చన్న అనుమానాలు, కంపెనీలు వెలువరించిన ఆర్థిక ఫలితాలు మిశ్రమ ధోరణిలో ఉండటం మార్కెట్‌పై ప్రభావాన్ని చూపాయి. ఆహార ద్రవ్యోల్బణం 8.04 శాతానికి పెరగడం కూడా దేశీయ మార్కెట్‌లో సెంటిమెంట్‌ను దెబ్బ తీసింది. శుక్రవారం సెన్సెక్స్ ఒక దశలో 52 వారాల కనిష్ఠ స్థాయి 16,991 పాయింట్లను తాకింది. చివర్లో కొద్దిగా కోలుకుని 17,306 పాయింట్ల వద్ద ముగిసింది. అంతక్రితం వారంతో పోలిస్తే సెన్సెక్స్ 891 పాయింట్లు నష్టపోయింది.

**ఎఫ్ఐఐల పనితీరు** } గతవారంలో విదేశీ సంస్థాగత మదుపుదార్లు (ఎఫ్ఐఐ) నికర అమ్మకందార్లుగానే ఉన్నారు. నికరంగా మార్కెట్ నుంచి రూ.1,492 కోట్లు ఉపసంహరించారు. మ్యూచువల్ ఫండ్‌లు మాత్రం రూ.17.6 కోట్ల నికర కొనుగోళ్లు చేశాయి.

**రంగాల వారీగా** } ప్రధాన కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఆశావహంగా లేకపోవడం, వడ్డీరేట్ల పెరుగుదలపై భయాలతో స్థిరాస్తి రంగానికి చెందిన షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. అంతర్జాతీయంగా కమోడిటీల ధరలు పడిపోవడంతో లోహ రంగానికి చెందిన షేర్లు బలహీనపడ్డాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటుపై అనుమానాలు ఐటీ షేర్లలో అమ్మకాలకు పురిగొల్పాయి. గత వారం లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:4గా ఉంది. ఇది మార్కెట్‌లో క్షీణపథ ధోరణిని ప్రతిబింబిస్తోంది.

**భవిష్యత్ అంచనా** } వచ్చే కొద్ది వారాలు/నెలల్లో తర్వాతి కీలక మద్దతు స్థాయి అయిన 16,000 పాయింట్ల వరకు పడిపోయే అవకాశాలు ఉన్నాయి. మళ్లీ 17,665 పాయింట్ల పై స్థాయికి చేరితేనే స్వల్పకాలానికి దిశ మారిందని భావించడానికి వీలు ఉంటుంది.

**ప్రభావిత అంశాలు** } అమెరికా రుణ రేటింగ్‌ను ఎస్ అండ్ పీ తగ్గించిన నేపథ్యంలో ఈ వారం నష్టాలతోనే మొదలవ్వొచ్చు. అంతర్జాతీయ మార్కెట్లను దేశీయ మార్కెట్ అనుసరించవచ్చు. ఆహార ద్రవ్యోల్బణం, శుక్రవారం వెలువడే ఐఐపీ గణాంకాలు, రుతుపవనాల పురోగతిని మార్కెట్ నిశితంగా పరిశీలిస్తుంది.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 16,991, 16,561, 16,137; **తక్షణ నిరోధ స్థాయిలు:** 17,482, 17,665, 17,844.

**స్వల్పకాలానికి మార్కెట్ మరింత బలహీనపడే అవకాశం ఉంది.**

*–సతీశ్ కంతేటి, జెన్‌మనీ*